“ఈ లిప్‌స్టిక్ ఎక్కడి నుంచి వచ్చింది?”

“నిజం చెప్పేస్తున్నాను. మా నటాషా కనిపించింది. ఇద్దరం సినిమా కెళ్ళాం. ఆ తర్వాత హోటల్లో ఆమె రూమ్‌కి వెళ్ళాం. ఏ.సి. రూమ్ చల్లగా, నటాషా వెచ్చగా కనిపించింది. ఇద్దరం చాలాసేపు మాట్లాడుకున్నాక అలా...అలా... ప్రేమ కలాపాల్లో పడిపోయి మునిగి తేలేటప్పటికి.”

“నేన్నమ్మను. డార్క్ డెవిల్ దగ్గర ఇంతసేపు గడిపి, కావాలని ఈ కథ అల్లుకొచ్చావ్ కదూ?”

“డార్క్ డెవిల్ అంటే ఎందుకంత కోపం నీకు?”

“తాగుబోతులంటే నాకు అసహ్యం”

“కానీ వాడు తాగటానికి రీజనుంది”

“ప్రతి తాగుబోతు అలాగే అనుకుంటాడు.”

“నాకు ఆకలేస్తోంది. భోజనం చేద్దామా?”

“ఇందాకటినుంచీ నీ కోసం ఎదురు చూస్తున్నాను. ఇంట్లో కూరలులేవు”.

“నేను కూరగా బావుంటానా?”

“త్వరగా తీసుకొస్తావా?””

ఆమె సంచీ  తెచ్చిచ్చింది.. దాంతోపాటు డబ్బు యివ్వలేదు. అంటే ఆమె దగ్గర బ్యాలెన్స్ ‘నిల్’ అన్నమాట.

బయటకు వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడతను.

“ఇంత త్వరగా వెళ్ళివచ్చేశావా?”

“అవును.”

సంచి క్రుమ్మరించిందామె.

బీరకాయలు, బీన్స్.

“తాజాగానే ఉన్నాయ్‌గానీ  అంతా సూపర్ సరుకు! రుచి వుండదు” అంది తులసి.

“నీకెలా తెలుసు స్ప్రే వేశారని?”

“చూస్తే తెలీటంలా- తెగ బలిసిపోయి వున్నాయి. ఎబ్ నార్మల్ గ్రోత్.”

“అయితేనేం?”

రాత్రి పది గంటలగ్గాని భోజనం రడీ అవలేదు.

“సాయంత్రం మహేష్ వచ్చాడింటికి” భోజనం చేస్తూ అంది తులసి. సురేష్ నోట్లో పెట్టుకున్న అన్నం ముద్ద నమలకుండానే మింగేశాడు.

“ఓ - వచ్చాడా? వెరీ కైండాఫ్ హిమ్.”

“అతని భార్య ఎవరితోనూ లేచిపోలేదు”

సురేష్‌కి గుర్తుకొచ్చింది. ఇన్‌కమ్‌టాక్స్ కుర్రాడితో లేచిపోయిందని చెప్పాడు తాను తులసికి.

"లేదా? ఎందుకని? మహేష్‌లాంటి డల్ ఫెలోకి భార్యగా వుంటూ లేచిపోకుండా వుండటం సాధ్యం కాదే?"

"నువ్వు చెప్పిన విషయం అడిగి నేను చాలా ఆక్‌వర్డ్ పొజిషన్‌లో పడ్డాను. పాపం మహేష్ కూడా ఇబ్బందిగా ఫీలయ్యాడు"

"హు! నేను చెప్పలేదూ మహేష్ వట్టి ఇడియట్ అని. నేనయితే నువ్వే పొజిషన్‌లో వున్నా లైక్ చేస్తాను"

తులసి కిలకిలా నవ్వేసింది. టేబుల్ లైట్ వెల్తురులో పడుకుని బి.ఇ.డి పుస్తకాలు చదవసాగింది ఆమె. సురేష్ కాసేపు అటూ ఇటూ పొర్లాడు.

"డోంట్ డిస్టర్బ్ మీ" అందామె అతని చేతిని తీసివేస్తూ.

"నిన్నేమీ డిస్టర్బ్ చేయకుండానే మానేజ్ చేస్తాను"

"వద్దు"

"నువ్వు మీ మహేష్ - ఇందాక ఎంజాయ్ చేశారు కదూ?"

"షటప్"

గిలిగింతలు భరించలేక చేతిలోని పుస్తకాల్ని జారవిడిచేసింది.

"ఇలా అయితే ఇంక నేను చదివినట్లే"

"ఇది కూడా చదువే! ఆ అన్నట్లు చెప్పటం మర్చిపోయాను. మనదేశంలో కూడా సెక్స్ ఎడ్యుకేషన్ బిగిన్ చేస్తున్నారట. నువ్వు టీచరయితే మరి ఎలా చెప్తావు ఆ సబ్జెక్ట్?"

తులసి ఆవేశంగా అతని గుండెలకు హత్తుకుంది.

*　　*　　*　　*

ఉదయం సురేష్ గెడ్డం చేసుకుంటూంటే గంగాభవాని విసురుగా వచ్చింది ఇంట్లోకి.

"మా పాదులకున్న బీరకాయలు, బీన్స్ కోసింది మీరే కదూ?" అంది ఇద్దరినీ గుచ్చి గుచ్చి చూస్తూ.

తులసి తెల్లబోయింది. సురేష్ గెడ్డం చేయటం ఆపలేదు. ఆమె వంక చూడనూ లేదు. గంగాభవాని సురేష్ కెదురుగా వచ్చి నిలబడింది.

"ఇది మీ పనేనని నాకు తెలుసు" అంది కోపంగా.

"అవును. కాదని ఎవరన్నారిప్పుడు?"

"మాకెందుకు సిగ్గు? అలా సూపర్ వేసి వాటిని పెంచినందుకు సిగ్గుపడాలి"

"సూపర్ వేశానని మీకెలా తెలుసు?"

“చూస్తే తెలీటం లేదూ? తెగ బలిసిపోయి ఎబ్ నార్మల్ గ్రోత్”

“అయితేనేం?”

“హెల్త్‌కి మంచిది కాదది. ఇంకోసారి సూపర్ వేయకండి! మా కిష్టంలేదు సూపర్ సరుకు.”

తులసి నవ్వేస్తోంది.

“మీరెవరు ఇష్టపడకపోడానికి?” అడిగింది గంగాభవాని కోపంగా.

“వాటిని ఉపయోగించేవాళ్ళం”

“ఇంకోసారి అలా చేశారంటే బావుండదు ఇప్పుడే చెప్తున్నాను” అందామె వెళ్ళిపోతూ.

“అయితే కూరగాయల రకాలు పెంచండి. ఒకటే రకం వాడటం మాకూ చిరాకే”

ఆమె విసురుగా నడిచింది బయటకు.

“సూపర్ కూడా వేయకండి, ఇప్పుడే చెప్తున్నాను.”

సురేష్ మరికాసేపటి తర్వాత  రడీ అయి బయటికొచ్చి తలుపుకి తాళం వేస్తుంటే గంగాభవాని పాదుల దగ్గర్నుంచి లేచి కోపంగా ఇంట్లో కెళ్ళిపోయింది. ఆమె వెనుకే లోపలకు నడిచాడతను.